క్లుప్తంగా

ఆలయ కమిటీ సభ్యుల శ్రమదానం


ఆలయ ఆవరణను శుభ్రం చేస్తున్న దాతలు

దెందులూరు: గోపన్నపాలెం కనకదుర్గమ్మ దేవాలయ ఆవరణలో దసరా మహోత్సవాలు పురస్కరించుకుని సుందరీకరణకు కొత్తపల్లి గ్రామ దాత చంద్రశేఖర్ అందజేస్తున్న దాతృత్వం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ప్రతి సంవత్సరం కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా ఆలయ ఆవరణలో పలు రకాల మొక్కల ఏర్పాటు, చెత్తాచెదారం పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమంలో ఆలయ ఆవరణ ఆహ్లాదకర వాతావరణంగా తీర్చిదిద్దుతూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్న దాత చంద్రశేఖర్‌కు తమ వంతు శ్రమదానం చేసి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఐదు రోజులుగా దాత ఆలయ కమిటీ సభ్యులు కలిసి మొక్కల ఏర్పాటు పనులు చేస్తున్నమని వివరించారు.

అధ్యాపకుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్


బీవీ శ్రీనివాస్

ఉంగుటూరు: ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణపురం కాలేజీ ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం అమరావతిలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ద్వారా కృషి చేస్తామని ఆయన తెలిపారు. శ్రీనివాస్ ఎన్నికవడంతో కళాశాలలో అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

భీమడోలు: గ్రంథాలయాలను విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయుడు మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా కవి పరిచయం, పుస్తక సమీక్షలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి చేసిన పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ ఉత్సవాలు


గంగానమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న భక్తులు

దెందులూరు: శ్రీరామవరం గ్రామంలో ఆదివారం శ్రీగంగానమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామవరంతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల వేషధారణలు, వాయిద్యాలు, ముత్యాలతో గంగానమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తుగా ఎస్సై రాజమల్లు శివాజీ పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

ఎరువుల వాడకం తగ్గించాలి


మందులు పిచికారీ చేస్తున్న రైతులు

దెందులూరు: వరి సాగులో అనేక చోట్ల సల్ఫైడ్ ఇంజురీ వస్తుందని రైతులు మేల్కొని నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం దెందులూరు, సత్యనారాయణపురం, కొమరేపల్లి గ్రామాల్లో వరి పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వరి పొలంలో నీరు అధికంగా నిలవ ఉంటే బుడగలు రావడం గ్యాస్ విడుదలై చేసుకు, వరి దుబ్బు వ్యవస్థకు హాని జరిగే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలతో తగు మోతాదులతో పొలంపై స్ప్రే చేయాలన్నారు. సల్ఫర్ ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సందేహాల నివృత్తికి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

అన్నదాతను వేధిస్తున్న తెగుళ్లు

- చిరుపొట్ట దశలో వెంటాడుతున్న ఖైనం
- ఆందోళనలో అన్నదాతలు
- ముమ్మరంగా నివారణ చర్యలు


తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్న రైతులు

పెదవేగి: ఖరీఫ్ సాగుపై తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ప్రస్తుత వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు ఖరీఫ్ పంటపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. దీంతో ఉల్లికోడు, తెల్లదోమ, మాగుడు తెగుళ్లు ఆశించి పంటకు నష్టం కలుగజేస్తున్నాయి. నివారణ చర్యలతో పెట్టుబడి తడిసి మోపెడవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లికోడు నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

41,500 ఎకరాల్లో సాగు

నియోజకవర్గానికి పెదవేగి, దెందులూరు, పెదపాడు మండలాల్లో 41,500 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశ నుంచి పొట్ట దశకు చేరుకుంది. ఈ దశలో పలుచోట్ల మాగుడు, తెల్లదోమ, ఉల్లికోడు ఉండటం రైతులను కలవరపరుస్తోంది. మాగుడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి వరి దుబ్బులు ఎండిపోతుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో తెల్ల దోమ బెడద అధికంగా ఉందని రైతులు అంటున్నారు. తెల్లదోమ ఆకుల్లో రసాన్ని పీల్చేయడం వలన ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయంటున్నారు. ఉల్లికోడు ప్రభావంతో వరి దుబ్బు మధ్యలోని ఆకులు చుట్టబెట్టుకుపోయి వెన్ను రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఆయా తెగుళ్లు పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, నివారణ కోసం ఎకరాకు రూ.వేయి వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందంటున్నారు.

దోమ ఆశించడానికి కారణాలివే

సాధారణంగా సెప్టెంబర్ నుంచి ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడాలి. కాని అందుకు భిన్నంగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న అధిక ఉష్ణోగ్రతలు, వాతావారణంలో తేమ అధికంగా ఉండడం, ఉక్కపోత వాతావరణం దోమ ప్రబలడానికి దోహదమవుతుంది. దీనికి తోడు ఏడాది పొడవునా వరి సాగు చేయడం, నారు మడి నుంచి రైతులు రెండు మూడు రకాల సస్యరక్షణ మందులను మిశ్రమం చేసి పిచికారీ చేయడం, నత్రజని కలిగి ఉన్న ఎరువులను మోతాదుకు మించి వాడడం దోమ ప్రబలడానికి కారణంగా వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నివారణ ఇలా

తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెదవేగి వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు వివరించారు. మాగుడు నివారణను అరికట్టేందుకు ఎక్సాకొనేజాల్ లేదా వెలిడామైసిన్ మందును లీటర్ నీటికి రెండు మిల్లీ లీటర్ల చొప్పున ఎకరాకు 200 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణ కోసం ఎసిపేట్ మందును లీటర్ నీటికి 1.6 గ్రాములు చొప్పున ఎకరాకు 200 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లికోడు తెగులుకు నివారణ లేదని, పొలంలో తెగులు కనిపిస్తే మిగిలిన దుబ్బులకు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా కార్బొసిరాన్ లేదా, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున వేయాలన్నారు.

తొలి దశలో ఉంది



వరి పొట్ట తొలి దశలో ఉంది. పెట్టుబడులు పెరిగిపోయాయి. ఈ ఏడాది తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే నాలుగైదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. ఇక ముందు ఎన్ని సార్లు పిచికారీ చేయాలో తెలియడం లేదు. వాతావరణం అనుకూలించకపోతే పంట చేతికి రావడం కష్టమే.

– జలగం రామ్మోహనరావు, వంగూరు రైతు

పురుగు మందులు వాడొద్దు



వరి చేనును తెల్ల దోమ, సుడి దోమ తొలి దశలో ఆశిస్తుంది. రైతులు విచక్షణా రహితంగా పురుగు మందులను వాడకూడదు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు, అవసరాన్ని బట్టి మందులు వాడుకోవాలి. అధికంగా ఎరువులు, పురుగు మందుల వాడకం వలన లాభాల కంటే నష్టాలే అధికంగా ఉంటాయి.

– సీహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖాధికారి పెదవేగి

లోక్‌అదాలత్‌లో 30 కేసుల రాజీ

దెందులూరు: జాతీయ లోక్ అదాలత్‌లో 30 కేసులు రాజీ అయ్యాయని ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ శనివారం భీమడోలు కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలతో దెందులూరు మండలం సంబంధించి చిన్న చిన్న గొడవలు, యాక్సిడెంట్ కేసులు, వివాహ సమస్యలు, ఆర్థిక పరమైన లావాదేవీలు కేసులు వంటి 30 కేసులు న్యాయమూర్తి సమక్షంలో రాజీ అయ్యాయన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి యుతంగా ప్రశాంతంగా జీవించాలని గొడవలు, అల్లర్లు, అశాంతి, కొట్లాటలకు దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు.

17 నుంచి వైద్య శిబిరాలు

దెందులూరు: ఆరోగ్యవంతమైన సమాజ లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు రెండు వారాల పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేష్ అన్నారు. ఆదివారం గోపన్న పాలెం వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు సేవలు పొందాలని సూచించారు.

వాహనమిత్రకు దరఖాస్తు చేసుకోవాలి

ఉంగుటూరు: వాహనమిత్ర పథకానికి ఈ నెల 17 నుంచి దరఖాస్తును సంబంధిత సచివాలయాల్లో చేసుకోవాలని ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సు, దరఖాస్తుతో పాటు అందజేయాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాలన్ని వాహనాలు, ఆటో రిక్షాల వారు ఉపయోగించుకోవాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


భీమడోలు: గుండుగొలను చర్చిలో విశ్వాసులకు అవగాహన కల్పిస్తున్న ఫాదర్ కాకి ఛార్లెస్

భీమడోలు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని గుండుగొలను ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కాకి ఛార్లెస్ అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో ఆదివారం గుండుగొలను ఆర్‌సీఎం చర్చిలో బాల్య వివాహాలపై సంఘ విశ్వాసులు, సండే స్కూల్ చిన్నారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బైబిల్‌లో ఉన్న వాక్యాన్ని విశ్వాసులకు ఫాదర్ ఛార్లెస్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశాన్ని అందించారు. ఫాదర్ ఛార్లెస్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన విద్య, ఆర్యోగానికి దూరమవుతారని, వారిలో విజ్ఞానం అభివృద్ధి చెందకుండా అమాయకత్వంతో జీవించాల్సి వస్తుందన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా, మండలం, గ్రామాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. 18 ఏళ్లలోపు మైనర్ బాలికలకు వివాహాలు చేయడం చట్టారీత్యా నేరమని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు విధిస్తారన్నారు. కార్యక్రమంలో విశ్వాసులు, క్రాఫ్ సిబ్బంది ఆర్.అమరావతి తదితరులు పాల్గొన్నారు.


ఉంగుటూరు: నీలాద్రిపురంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నీలాద్రిపురంలో బాల్య వివాహాలపై అవగాహన

ఉంగుటూరు: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నీలాద్రిపురం గ్రామంలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకండ్ టు ఎండ్ చైల్డు మ్యారేజీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి


సుందర్‌బాబు

దెందులూరు: గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో గణనీయంగా నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుందర్‌బాబు అన్నారు. ఆదివారం వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మారిన ఆహారపు అలవాట్లకనుగుణంగా యువత చిన్నారుల్లో రక్తహీనత కలగటం, రోగనిరోధకశక్తి లేకపోవడం, మారుతున్న వాతావరణం పరిస్థితులకు అనుగుణంగా వైరల్ ఫీవర్లు నమోదు అవుతున్నాయన్నారు. గత పది రోజులుగా వైరల్ ఫీవర్ బారిన పడిన వారు సంఖ్య పెరిగిందన్నారు. అధిక జ్వరం, కళ్లు, ముక్కు వెంట నీరు కారటం, ఒళ్లు నొప్పులు, తలపోటు, నీరసంగా ఉండటం, దగ్గు రావటం, వంటివి వైరల్ ఫీవర్ లక్షణాలని వైద్యులు తెలిపారు. ప్రతి రోజూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, సమీప వైద్యశాలలో వైద్య పరీక్షలు పొందాలని వైద్యులు తెలిపారు. డోలో ట్యాబ్లెట్లు ఉదయం, సాయంత్రం వేసుకోవాలని, ఆహారపు అలవాట్లు మితంగా ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు.

చురుగ్గా వంతెన మరమ్మతులు

ఉంగుటూరు: నారాయనపురం వంతెన మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. శ్లాబ్ కింద ఐరన్ డక్కింగు పనులు ఆదివారం నిర్వహించారు. వంతెన పనులు వేగంగా జరుగుతుండటంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. త్వరగా పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయని అనుకుంటున్నారు. పాత వంతెన వెడల్పు 6.8 మీటర్ల ప్రకారమే వెడల్పు రానుంది. ఆర్‌అండ్‌బీ డీఈ, ఏఈల పర్యవేక్షణలో పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు వంతెన పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం


ఎస్టీయూ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

గణపవరం: ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉపాధ్యాయులు కలిసి కట్టుగా ఉద్యమించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల సూర్యప్రకాశరావు అన్నారు. గణపవరం మండల ఎస్టీయూ నూతన కమిటీకి ఎన్నికైన సభ్యులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలు దక్కకపోవడం దారుణమని, కనీసం నిర్ణీత కాలంలో ఇవ్వాల్సిన డీఏలు కూడా ఇవ్వడం లేదని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల కమిటీ సభ్యులుగా ఎన్నికైన అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, కార్యదర్శి జి.ఏడుకొండలు ఇతర కార్యవర్గ సభ్యులతో పాటు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఒ.శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌లను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

జోరువానతో జలదిగ్బంధం


దెందులూరులో కురుస్తున్న జోరు వాన


నీట మునిగిన రహదారులు

దెందులూరు : మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వరి దుబ్బులు ఏపుగా పెరగడమే కాకుండా నీళ్లు అధికమై వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఈ వర్షాలు ఇంకా కొనసాగితే నష్టపోవడం తథ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న దోసపాడు, పోతునూరు, కొవ్వలి ఉండ్రాజవరం గ్రామ రైతులకు ఈ భారీ వర్షంతో తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉంది. దెందులూరు సైఫన్ వద్ద అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టారు. –

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గణపవరం: పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని గణపవరం మండలం జల్లికొమ్మర హైస్కూల్ హెచ్‌ఎం పుప్పాల ప్రకాశరావు అన్నారు. ఆదివారం గణపవరం మండలం జల్లికొమ్మర హైస్కూలులో 2012–13 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న సమయంలో ఏడో తరగతి వరకూ చదివి ఉన్నత చదువుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లేవారమని, నేడు గ్రామంలోనే హైస్కూలుగా ఉన్నతీకరణ చేసి పదో తరగతి వరకూ అవకాశం కల్పిండంపై ఆనందం వ్యక్తం చేశారు. హైస్కూలుగా ఏర్పడినందున కావలసిన సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థులు సహకరించాలని హెచ్‌ఎం ప్రకాశరావు కోరగా వారు అంగీకరించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

16న ఏలూరులో జాబ్ మేళా

దెందులూరు: సెట్‌వెల్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా జిల్లా ఫైనాన్స్ మేనేజర్, ఎంపీడీవోకే శ్రీదేవి అన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కేరీర్ సర్వీస్ (ఎన్‌సీయస్), సెట్‌వెల్ ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళాను ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కాంపౌండులోని సెట్‌వెల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో రాయల్ ఎన్‌ఫీల్డ్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎస్ఎస్ ఇనిస్ట్యుమెంట్స్, కోల్‌గేట్, పామాలివ్, భారతి ఆక్సా లైఫ్ ఇన్స్యూరెన్స్, తదితర ప్రముఖ కంపెనీ ప్రతినిధులు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ చెన్నైలో ఆపరేటర్ (ఎన్ఏపీఎస్) పోస్టులకు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ అర్హత కలిగిన అభ్యర్థులను నియమించుకోనుందని వయసు 18–23 ఏళ్ల మధ్య, జీతం రూ.16,500–రూ.19,500 మధ్య ఉంటుందన్నారు. టాటా ఎలక్ట్రానిక్స్ (మహిళలకే) ఆపరేటర్, అసెంబ్లీ లైన్ ఉద్యోగాలకు డిగ్రీ, ఇంటర్ మీడియట్ అర్హత ఉన్న మహిళలను తీసుకోనుందని జీతం రూ.18,092, ఉచిత భోజనం, వసతి, రవాణా సదుపాయాలు కల్పించబడతాయని, వయసు 18–26 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. ఎస్ఎస్ ఇనిస్ట్యుమెంట్స్ శ్రీసిటీలో ఆపరేటర్ పోస్టులకు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. జీతం రూ.14,000–16,500, వయస్సు 18–26 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. కోల్‌గేట్ పోలమోవిల్ సంస్థ శ్రీసిటీలో ఆపరేటర్ ఉద్యోగాలకు 2 సంవత్సరాల ఐటీఐ అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. వయసు 18–25 ఏళ్ల మధ్య ఉండాలని, జీతం రూ.14,500 ఇస్తారని తెలిపారు. భారతీ ఏఎక్స్ఏ లైఫ్ ఇన్స్యూరెన్స్ ఏలూరులో డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టులకు డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులను నియమించుకోనుందని, జీతం రూ.15000–రూ.30,000 ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఫార్మల్ డ్రస్ కోడ్‌లో హాజరుకావాలని, అవసరమైన డాక్యుమెంట్స్, రెజ్యూమ్ తీసుకురావాలని సూచించారు.

దర్శన ప్రయాణానికి భక్తుల అగచాట్లు

బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న భక్తులు


కిక్కిరిసిన బస్సులో ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న భక్తులు

భీమడోలు: ద్వారకాతిరుమల స్వామి వారి దర్శనానికి వెళ్లే ప్రయాణం భక్తులకు చుక్కలు చూపిస్తుంది. పలు జిల్లాల నుంచి వచ్చే భక్తులకు సరిపడా బస్సులు లేక ప్రయాణం నరకప్రాయంగా మారింది. సెలవుల్లో దైవ దర్శనానికి వెళ్లి, స్వగ్రామాలకు చేరాలంటే ప్రహసనంగా మారింది. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు అధిక సంఖ్యలో భీమడోలు బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణ రోజుల్లో కన్నా సెలవులు, పండుగ రోజుల్లో రద్దీగా ఉంటుంది. దీంతో రెండో శనివారం, ఆదివారం సెలవుల్లో ద్వారకాతిరుమలకు కుటుంబ సమేతంగా వెళ్లాలంటేనే భీతిల్లిపోతున్నారు. గతంలో కన్నా స్త్రీశక్తి పథకం అమలుతో ఈ తిప్పలు ఎక్కువయ్యాయని ప్రభుత్వ విధానాలను బాహాటంగా విమర్శిస్తున్నారు. ఆదివారం భీమడోలు బస్టాండ్ భక్తులతో రద్దీగా మారింది. దీంతో వృద్ధులు, మహిళలు, పిల్లలతో వచ్చే వారి బాధలు వర్ణనాతీతం. స్త్రీశక్తి పథకం అమలైన తరువాత భీమవరం, నరసాపురానికి వెళ్లే బస్సులు రద్దు చేశారు. దీంతో ఆ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వచ్చే ఇతర డిపోల్లోని అరకొర బస్సుల్లో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. భీమడోలు బస్టాండ్ నుంచి సుమారు 50 గ్రామాలకు చెందిన 5 వేల మంది ప్రయాణికులు పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్టాండ్‌కు ప్రతి రోజూ 250 బస్సులకు వస్తుంటాయి. జిల్లాలో ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఇదే ప్రధాన బస్టాండ్ కావడంతో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. వాస్తవానికి బస్సులో 54 మందికి సీట్లు ఉండగా 70 మందికి పైగా ఎక్కుతున్నారు. కిక్కిరిసిన బస్సుల్లో గత్యంతరం లేక ప్రయాణిస్తున్నారు. ప్రైవేటు వాహనాలు ఎక్కితే చుక్కలు అంటుతున్న రేట్లతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. స్త్రీ శక్తి ద్వారా లబ్ధి పొందిన సొమ్ము కన్నా రెట్టింపు ధరలతో నష్టపోతున్నామని ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. రద్దీ రోజుల్లో బస్టాండ్‌లో పోలీసులు, దేవస్థానం సెక్యూరిటీ లేకపోవడంతో విలువైన ఆభరణాలు అపహరణకు గురువుతున్నాయని భక్తులు వాపోతున్నారు. రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని, సర్వీసులు పెంచి రద్దీని తగ్గించే చర్యలను ఆర్టీసీ అధికారులు తీసుకోవాలని ప్రయాణికులు, భక్తులు వేడుకుంటున్నారు.